క్లుప్తంగా

నేటి నుంచి రామచంద్రమ్మ ఉత్సవాలు



రామచంద్రమ్మ

పరవాడ: వాడచీపురుపల్లి, పరిసర గ్రామాల ప్రజలు ఆరాధ్యదైవంగా కొలిచే రామచంద్రమ్మ అమ్మవారి పండగ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. సోమవారం రాత్రికి అమ్మవారి పుట్టుక కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతుంది. తొమ్మిది రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలను నిర్వహించి ఈ నెల 27న మంగళవారం అనుపు మహోత్సహం నిర్వహిస్తారు. ఈ నెల 25న రాష్ట్ర స్థాయి కర్రసాము, వెపన్స్ చాంపియన్‌షిప్ పోటీలు, ఓపెన్ షటిల్ పోటీలు, 27న వాలీబాల్, చిడతల పోటీలను ఉత్సవ కమిటీ నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భారీ ఎత్తున బాణ సంచా కాల్పులతో అమ్మవారి అనుపు మహోత్సవం నిర్వహించనున్నట్టు రామచంద్రమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

పరవాడ: వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెంలోని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ గెస్ట్ హౌస్‌లో సోమవారం ఉదయం 8 గంటలకు మండలంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు పాల్గొంటారని చెప్పారు. సమావేశం అనంతరం ఉదయం 10 గంటలకు పరవాడ మరిడిమాంబ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు రామారావు కోరారు.

కంప్యూటర్ అందజేత



బాలికల కళాశాలకు కంప్యూటర్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పరవాడ: స్థానిక బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులను ప్రోత్సహించడానికి ముందుకు వచ్చిన విశాఖ లయన్స్ క్లబ్ యాజమాన్యానికి కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేసింది. విశాఖపట్నంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ యాజమాన్యం కళాశాల విద్యార్థుల కోసం సమకూర్చిన కంప్యూటర్‌ను లయన్స్‌క్లబ్ యాజమాన్యం కళాశాల యాజమాన్యానికి ఆదివారం అందజేసింది. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధి మంత్రి జగన్నాథరావు పాల్గొన్నారు. హెచ్‌ఎం రాజశ్రీ , అధ్యాపకులు ఎస్.విజయశ్రీ, దిలీప్‌కుమార్, అప్పలనాయుడు, నిర్మలకుమారి, శ్యామల, లోవ శ్రీనివాసు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి సాయం



పైడమ్మకు వంటసామగ్రి వస్తువులు, నగదు అందజేస్తున్న కర్రి అప్పలస్వామి

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు అప్పన్నపాలెంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయురాలైన బొట్టా పైడమ్మను అడవివరంలోని కర్రి అప్పలస్వామి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కర్రి అప్పలస్వామి ఆదుకున్నారు. రూ.12 వేల విలువైన వంటసామగ్రి, పాత్రలు, 25కిలోల బియ్యం, గ్యాస్ స్టవ్, పంచదార, నూనె, కందిపప్పు, దుప్పట్లు, చీరలు అందజేశారు. అలాగే రూ.2 వేల నగదు అందించారు. ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 98వవార్డు నాయకులు పీతల అప్పలరాజు, పీతల విష్ణు, గంట్ల కిరణ్‌బాబు, కర్రోతు అప్పలరాజు, బంటుబిల్లి సురేష్ ,నోళ్ల దేముడు పాల్గొన్నారు.

రహదారులు.. రాచమార్గాలు

పెందుర్తి నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం, మరమ్మతులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. దశాబ్దాలుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరమగీతం పాడారు. ప్రధాన రహదారులతో పాటు గ్రామాలను, కాలనీలను అనుసంధానం చేస్తున్న రోడ్లను రాచమార్గాలుగా తీర్చిదిద్దారు. పెందుర్తి–సబ్బవరం–అనకాపల్లి ప్రధాన రహదారి సహా ఇటు గ్రామీణ, అటు పట్టణ ప్రాంతాల్లో రహదారులకు మెరుగులు దిద్దారు. ఎక్కడికక్కడ రోడ్లను సుందరంగా ముస్తాబు చేశారు. ఆయా రోడ్లపై ప్రజలు హాయిగా ప్రయాణం చేస్తున్నారు.

– పెందుర్తి



విస్తరణ తరువాత పులగానిపాలెం(పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ రోడ్డు) రహదారి



పాపయ్యరాజుపాలెం–చీమలాపల్లి రహదారి



ముస్తాబైన గొరపల్లి–గొల్లలపాలెం–గుళ్లేపల్లి రోడ్డు



సుందరంగా సుజాతనగర్ రహదారి



సువిశాలంగా పెందుర్తి–సబ్బవరం–అనకాపల్లి ప్రధాన రహదారి

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు



శస్త్ర చికిత్స కోసం తరలిస్తున్న రోగులు

సబ్బవరం: శ్రీషిర్డీసాయి సేవాసమితి ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సబ్బవరంలోని షిర్డీసాయి మందిరం వద్ద నిర్వహించిన శిబిరంలో 95 మంది కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 21 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారిని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. వీరిలో కంటి నరాల చికిత్స కోసం ఇద్దరు, కంటి పై పొర చికిత్స కోసం–2, కంటి నీటి కాసుల చికిత్స కోసం–ఒకరు,కంటి రెప్పల చికిత్స కోసం–ఒకరు,చిన్న పిల్లల చికిత్స కోసం ఒకరిని గుర్తించారు.

కార్యక్రమంలో కుమార్ పంతులు,సత్యం నాయుడు మాస్టార్,ప్రకాష్,శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ సురేష్,శంకర్ ఫౌండేషన్ క్యాంప్ మేనేజర్ అరుణకుమార్, కోఆర్డినేటర్ జోగారావు, నర్సింగ్ స్టాఫ్ శాంతి,షిర్డీసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన శ్యామా నవరాత్రి ఉత్సవాలు



శ్రీలలితా మహా త్రిపుర సుందరిగా రాజశ్యామల

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి శ్రీరాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో నిర్వహించిన శ్యామా నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిసాయి. నవరాత్రులు చివరి రోజున అమ్మవారు రాజశ్యామలగా భక్తులకు దర్శనమిచ్చారు. రాజశ్యామల అమ్మవారిని దర్శనం చేసుకునే భక్తులకు సమస్త భోగభాగ్యాలు,సదివ్వద్య అవగతమవుతాయని నమ్మకం. రాజ్యాధికారం,పదవీ కాంక్షితులకు అమ్మవారి దర్శన భాగ్యం ద్వారా కటాక్షం కలుగుతుందని గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. అమ్మవారి సన్నిధిలో సహస్ర నామావళి అర్చన, రాజ శ్యామల హోమం నిర్వహించారు. సాయింత్రం హరికాదేవి శ్యామా అమ్మవారి చరిత్రను తెలుపుతూ హరికథ కథనం గావించారు. సాయంత్రం శ్యామా సిరిజ్యోతి పూజ చేశారు. అమెరికా,రష్యా దేశాల నుంచి వచ్చిన సాధకులు నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. గురుమాత అన్నపూర్ణమ్మ భక్తులందరినీ ఆశీర్వదించారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అర్చకులు అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న లోకేష్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న లోకేష్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరం పూజ నిర్వహించారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: నగర కమిషనర్ డా.రవిశంకర్, అడిషనల్ కమిషనర్ వెంకటరావు(స్పెషల్ బ్రాంచ్) ఆదేశాల మేరకు గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా గంజాయి తరలిస్తున్న యువకుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్ మెయిన్ గేటు వద్ద అల్లూరి సీతారామరాజు జిల్లా అట్లగూన గ్రామం అరకుకు చెందిన పంగి గోపినాథ్ అనే యువకుడు అరకు నుంచి బెంగుళూరుకు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నాడని సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఆదేశాల మేరకు ఎస్ఐ భరత్‌కుమార్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. యువకుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా.. నాలుగు కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్ ఉన్నట్లు గుర్తించి ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

రూ.34,700 నగదు స్వాధీనం

సీతమ్మధార: ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఐదుగురిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి సుబ్బలక్ష్మీనగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో గల ఒక ఫ్లాట్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఫోర్త్‌టౌన్ పోలీసులు సోదాలు నిర్వహించారు. అక్కడ పేకాటాడుతున్న కంచరపాలెం ఇందిరానగర్‌కు చెందిన కడగల రామకృష్ణ, గాజువాక కర్ణవానిపాలేనికి చెందిన ఎస్.భీమరాజు, తాటిచెట్లపాలెం ఆంజనేయ స్వామి ఆలయం వెనుక వీధికి చెందిన వేకి శ్రీనివాసరావు, కంచరపాలెం గజపతినగర్‌కు చెందిన బోరులపల్లి శ్రీనివాసరావు, దొండపర్తి సుబ్బలక్ష్మీనగర్‌కు చెందిన రఘుమండ మోహన్‌రావులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.34,700 నగదు స్వాధీనం చేసుకున్నారు.

వేడుకగా సత్తివమ్మ పేరంటాలు తీర్థం



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ జెడ్పీటీసీ కొటాన రాము తదితరులు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు ఆదిరెడ్డిపాలెంలో సత్తివమ్మ పేరంటాలు తీర్థమహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి పేరంటాల తల్లికి భక్తులు దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తుల పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు కొటాన రాము, ఎంపీటీసీ సభ్యులు బైలపూడి దేముడు, మాజీ వైస్ ఎంపీపీ కొటాన కోటయ్య, అనకాపల్లి మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ గొంప దేముడు,కొటాన రాంబాబు,దేవీ దంపతులు, బైలపూడి సత్యం,మడ్డు సూర్యనారాయణ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

ప్రజా సంకల్పానికి కేంద్రం తలవంచక తప్పదు



దీక్షలో పాల్గొని నినాదాలు చేస్తున్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : ప్రజల సంకల్పం బలంగా ఉన్నంత కాలం పోరాటాల పురిటి గడ్డ విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేసినా తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న 1102వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ వాటిని అమలు జరిపే అధికారులకు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు తహతహలాడుతోందని, విశాఖ ఉక్కు జోలికి వస్తే కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. విశాఖ ఉక్కును కొనడానికి ఎవరు ముందుకొచ్చినా అడ్డుకుంటామని, పోరాటాలు, ప్రాణ త్యాగాల ద్వారా సాధించుకున్న సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం కానివ్వమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కుర్తాళం పీఠాధిపతికి ఘన స్వాగతం



సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామికి స్వాగతం పలుకుతున్న భక్తులు

సీతంపేట: అమృతోత్సవం పేరిట నిర్వహిస్తున్న శ్రీలలితా పీఠం 75వ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు కుర్తాళం పీఠాధిపతి, జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆదివారం అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠానికి వచ్చారు. కుర్తాళం నుంచి వచ్చిన స్వామీజీ, శక్తి పీఠాధీశ్వరి రామ్యానంద భారతీ స్వామినిలకు పీఠం వేద పండితులు, అర్చకులు పూర్ణకుంభం, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి దారి పొడుగునా పూలతో ఆహ్వానించారు. ఈ నెల 19 నుంచి 24 వరకు పీఠాధిపతి సమక్షంలో అమృతోత్సవాలు జరుగుతాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

పద్య, గేయ రచయితలకు సత్కారం



రచయితలను సత్కరిస్తున్న ఆచార్య బేతవోలు, డాక్టర్ రఘురామారావు

సీతంపేట: ఇటీవల తానా నిర్వహించిన పద్య, గేయ కావ్యాల పోటీల్లో విజేతలకు సత్కార కార్యక్రమం విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు అధ్యక్షతన ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. మొదటి స్థానం గెలుపొందిన పద్యకావ్యం 'జీవన వాహిని' రచయిత బులుసు వెంకటేశ్వర్లు, 'యువావతరణము' గేయ కవిత్వాన్ని రచించిన రాంభట్ల నృసింహశర్మ, 'సామాజిక త్రిశతి' శతక కర్త సిహెచ్.చిన సూర్యనారాయణలను ముఖ్య అతిథి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం చేతుల మీదుగా దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బేతవోలు మాట్లాడుతూ తానా సంస్థ చేస్తున్న సాహిత్య సేవ ప్రసంశనీయమని, ఇటీవల పుస్తక ప్రచురణ కూడా పెద్ద ఎత్తున చేపట్టిందన్నారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి రచనలను నాలుగు సంపుటాల్లో ప్రచురించిందని గుర్తుచేశారు. సమాజానికి మేలుచేసే ఆధునిక ఇతివృత్తంతో తానా నిర్వహించిన పద్య, గేయ రచనల్లో విశాఖకు చెందిన ముగ్గురు రచయితలు చేసిన రచనలు ఉత్తమమైనవిగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జీవన వాహిని పద్య కావ్యం రచయిత అద్భుతమైన పద్య రచనా శైలిని ఆద్యంతం ప్రతిబింబిస్తుందన్నారు. భారతీయ జీవన విధానంలో వచ్చిన మార్పులపై అలవోకగా అనుప్రాసలతో యువావతరణము గేయ కావ్యం ఆకట్టుకుందన్నారు. డాక్టర్ రఘురామారావు మాట్లాడుతూ అద్భుత రచనలు చేసిన ముగ్గురు పండితులను సత్కరించే అవకాశం విశాఖ రసజ్ఞ వేదికకు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అరసం అధ్యక్షుడు ఉప్పల అప్పలరాజు, పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు నెహ్రూ అవార్డులు



సీఎండీ నుంచి అవార్డు అందుకుంటున్న ఉద్యోగి జయరాజు



అవార్డు అందుకుంటున్న వైద్యురాలు సుజాత

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 105 మంది ఉద్యోగులకు యాజమాన్యం జవహర్‌లాల్ నెహ్రూ అవార్డులను ప్రదానం చేసింది. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకత, క్షమశిక్షణ కలిగిన ఉద్యోగులకు ఏటా ఉక్కు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకల్లో నెహ్రూ అవార్డులు అందజేస్తారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం ఉక్కునగరం ఎంపీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో సీఎండీ అతుల్ భట్ చేతుల మీదుగా 56 మంది అధికారులు, 49 మంది కార్మికులు అవార్డులు అందుకున్నారు. అదేవిధంగా ప్రతిభ చూపిన సీఐఎస్ఎఫ్ సిబ్బందికి కమెండేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు డీకే మొహంతి, బాగ్చీ, ఎస్.సి.పాండేతో పాటు పలువురు ఉన్నతాధికారులు, అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చదవని పుస్తకాలను డొనేట్ చేయండి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

సీతంపేట: సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గ్రంథాలయ గాంధీ వెలగా వెంకటప్పయ్య 9వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక పురస్కారాన్ని ఉండ్రాజవరం గ్రంథపాలకుడు నున్నవెంకట రామారావుకు ఆచార్య పి.బాలమోహన్‌దాస్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు పి.ఎస్.ఎన్.మూర్తి రచించిన 'డెవలప్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ అండర్ సీఎస్ఆర్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పబ్లిక్ లైబ్రరీల పరిస్థితి ఇబ్బందికరంగా ఉందన్నారు. దీనికి కారణం ఫిజికల్ బుక్స్‌కు ప్రత్యామ్నాయంగా డిజిటల్, ఎలక్ట్రానిక్ బుక్స్ వచ్చాయని చెప్పారు. చేతిలో మొబైల్ ఉంటే గూగుల్ చేస్తే అన్ని పుస్తకాలు మన వద్ద ఉన్నాయన్న భావన పాఠకులు, విద్యార్థుల్లో కనిపిస్తోందన్నారు. పుస్తకాన్ని చదువుతుంటే వచ్చే ఆనందం.. మొబైల్, కంప్యూటర్స్‌లో చదివితే రాదన్నారు. కంపెనీలు తమ లాభాల్లో కొంత భాగాన్ని సీఎస్ఆర్ కింద పబ్లిక్ లైబ్రరీల అభివృద్ధికి ఇచ్చేలా సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ సంస్థ కృషి చేసిందని కొనియాడారు. విశాఖ పౌర గ్రంథాలయం అభివృద్ధే దీనికి నిదర్శనమన్నారు. చాలా మంది వద్ద పుస్తకాలు చదవకుండా ఉన్నాయని, వాటిని ప్రజలకు ఇచ్చేలా బుక్ డొనేషన్ క్యాంపెయిన్ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వెలగావ్రోత్తమరావు, ఎం.కోటేశ్వరరావు, సాంబశివరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

భారత సంస్కృతి, నాగరికతపై అవగాహన అవసరం



డాక్టర్ వామదేవ శాస్త్రిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీ కాలనీ: పాశ్చాత్య దేశాలు విశ్వసిస్తున్న భారతదేశ సంస్కృతి, నాగరికతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పండిట్ వామదేవ శాస్త్రి సూచించారు. శివానంద సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'రీకన్‌స్ట్రక్టింగ్ ది కల్చరల్ హిస్టరీ ఆఫ్ భారత'అంశంపై రెండు రోజుల సింపోజియంను ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం వేదికగా నిర్వహించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధి పండిట్ వామదేవ శాస్త్రి మాట్లాడుతూ భారతదేశం గొప్ప, సజీవమైన నాగరికతను కలిగి ఉందన్నారు. అయితే చాలా మంది పాశ్చాత్య చరిత్రకారులు భారత సంస్కృతిని వక్రీకరించి రాశారన్నారు. ఈ నేపథ్యంలో భారత ప్రాచీన చరిత్ర మూలాలను, నాగరికతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవడంతో పాటు ప్రపంచానికి అందించాలన్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధాకుమారి మాట్లాడుతూ భారత చరిత్రకారులు రాసిన మనదేశ చరిత్ర కొంత మేర వెలుగులోకి రాలేదన్నారు. ఈ నేపథ్యంలో శివానంద సుపథ ఫౌండేషన్ ద్వారా ప్రాచీన భారత చరిత్రను నేటితరానికి వెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. నేటి చరిత్రకారులు రాసిన పుస్తకాలను ప్రచురించడం, సదస్సు ల ద్వారా చారిత్రక ఆధారాలను ప్రజల్లోకి తీసుకెళ్ల డం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆచార్య సుదర్శనరావు, ఆచార్య ఆర్.రాఘవేంద్రన్ తదితరులు పాల్గొన్నారు. పండిట్ వామదేవ శాస్త్రిని నిర్వాహకులు సత్కరించారు.

ఘనంగా నిత్యానంద ప్రభువు జయంతి

ఆరిలోవ: హరేకృష్ణ మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఏయూ కేవీ గోపాలరావు థియేటర్‌లో ఆదివారం సాయంత్రం నిత్యానంద ప్రభువు జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి ప్రతిమలకు క్షీర, జలాభిషేకాలతో పాటు వివిధ రకాల పూలతో పూజలు చేశారు. హరినామ సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రవచనాలు నిర్వహిచారు.